క్లుప్తంగా

తుంగను తొలగించండి



దూది పువ్వును చూపిస్తున్న కాలనీ వాసులు

హుస్నాబాద్: ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లో తుంగ మొలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏడో వార్డులోని పాత పోస్టాఫీసు వెనుకాల ఖాళీగా ఉన్న వ్యవసాయ భూమిలో మొలిచిన తుంగను కాలనీవాసులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంగమీది దూది పువ్వులుగా ఏర్పడి గాలిద్వారా ఇళ్లలోకి చేరుతుందన్నారు. దూది పువ్వు శరీరంపై పడి దద్దుర్లు, వివిధ ఎలర్జీలు వస్తున్నాయని వాపోయారు. మున్సిపల్ అధికారులు తుంగను తొలగించాలని కోరారు. నాయకులు వికాస్ యాదవ్, సునీత, లక్ష్మణ్, కాలనీ వాసులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, సరస్వతి తదితరులు ఉన్నారు.

పార్కింగ్ స్థలం ఎక్కడ?



ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న బాల్ లింగం

హుస్నాబాద్: పట్టణంలోని వ్యాపారస్తుల కూడలిలో పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని వినియోగదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వొడ్నాల బాల్‌లింగం కోరారు. ఏసీపీ సదానందం, మున్సిపల్ మేనేజర్‌కు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు దుకాణాల ఎదుట వాహనాలు ఆపితే పోలీసులు జరిమానా విధిస్తున్నారన్నారు. పార్కింగ్ స్థలం చూపించేంత వరకు జరిమానాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల హామీ నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు, ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్‌లో సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలు, ఆసరా పింఛన్లు రూ.4 వేలు అందించాలన్నారు. సిద్దిపేటలో బుధవారం నిర్వహించనున్న దివ్యాంగుల సదస్సుకు మంద కృష్ణమాదిగ హాజరవుతారని, దివ్యాంగులంతా హాజరు కావాలని కోరారు. నాయకులు ఉప్పలయ్య, సురేందర్, బాలకృష్ణ, రవీందర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రేమతో



నోట్ పుస్తకాలు అందిస్తున్న భవనంజలిశ్రీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులపై ప్రేమతో ఓ వైద్య విద్యార్థిని నోట్ పుస్తకాలు అందించారు. మండలంలోని వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి కూతురు భవనంజలిశ్రీ గాంధీ మెడికల్ కళాశాలలో ఎండీ చదువుతున్నారు. ఆమెకు అందిన మొదటి స్టయిఫండ్‌తో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ, ఉపాధ్యాయులు పరశురాములు, మల్లయ్య, బాలనర్సింహారెడ్డి, స్వామి, రవి, రాజు, రంజిత్, అమ్మ ఆదర్శ చైర్మన్ భవాని, కొండపోచమ్మ డైరెక్టర్ వెంకటరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆసరా

జగదేవ్‌పూర్(గజ్వేల్): పక్షవాతానికి గురై ఇబ్బందులు పడుతున్న తిగుల్‌కు చెందిన పార్వతికి అదే గ్రామానికి చెందిన గౌరీశంకర్ పంతులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన పార్వతి కొన్ని నెలలుగా పక్షవాతానికి గురై ఇంటి వద్దనే ఉంటోంది. పనులు చేయలేని పరిస్థితితో కుటుంబ పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న గౌరీశంకర్ పంతులు సోమవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడుగులు వేసి.. అనుకున్నది సాధించి

కార్పొరేట్‌కు దీటుగా మర్రిముచ్చాల పాఠశాల

- విద్యార్థుల సంఖ్య పెంచిన ఉపాధ్యాయులు
- సంతోషిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



మర్రిముచ్చాల ప్రాథమిక పాఠశాల

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యను అందించగలమని మర్రిముచ్చాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరూపిస్తున్నారు. ఈ పాఠశాలకు గతేడాది సాధారణ బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు అశోక్, సాంబయ్య కలసి బోధనలో మార్పు తేవాలని, విద్యార్థుల సంఖ్య పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా అడుగులు వేసి అనుకున్నది సాధించారు.

గురువుల కృషి

పాఠశాలలో గత సంవత్సరం ఐదు తరగతులకు సంబంధించి 15 మంది విద్యార్థులు ఉండేవారు. అందులో ముగ్గురు ఉన్నత పాఠశాలకు వెళ్లడంతో ఈ యేడాది ఆరంభం నాటికి 12 మంది విద్యార్థులే మిగిలారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు వారు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. టై, బెల్టు, యూనిఫారాలతోపాటు విద్యార్థులు కూర్చోవడానికి డెస్కులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

54కు పెరిగిన విద్యార్థుల సంఖ్య

ఉపాధ్యాయుల కృషి చూసి ఆకర్షితులైన కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి ముందుకు వచ్చారు. ఫొటోలు దిగి విలేజ్ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. దానితో మరి కొంతమంది తల్లిదండ్రులు ఆకర్షితులై తమ చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 54కు చేరింది.

అదనపు గదులు అవసరం

విద్యార్థుల సంఖ్య అధికమవడంతో వారికి తగిన విద్యను అందించాలంటే మరో ముగ్గురు ఉపాధ్యాయులు, రెండు అదనపు గదులు అవసరం. వాటిని ప్రభుత్వం వెంటనే అందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాల తరహాలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

సామర్థ్యం పెంచుతున్నాం



ప్రభుత్వ పాఠశాలలను ఆకర్షించేలా సౌకర్యాలు కల్పించుకుంటూ విద్యాబోధన చేస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు విద్యార్థుల సంఖ్య పెరిగింది. వచ్చే యేడాదికి 80 మందికి పైగా విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిది.

– అశోక్, హెచ్‌ఎం

మంచిగా బోధిస్తున్నారు



నేను గతంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్నాను. ఈ సంవత్సరమే ఈ పాఠశాలలో చేరాను. అక్కడి కంటే ఈ పాఠశాలలోనే బోధన బాగుంది. ఉపాధ్యాయులు మాకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు ధన్యవాదాలు.

– నిహారిక, 5వ తరగతి విద్యార్థిని

రెవెన్యూ అధికారులకు నోటీసులు

తప్పుదోవ పట్టించిన వారిపై ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

కొండపాక(గజ్వేల్): ఇద్దరు రెవెన్యూ అధికారులకు సోమవారం షోకాజ్ నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ తెలిపారు. 'పైసలిస్తే పనులు ఖాయం' పేరిట సాక్షి పత్రికలో 12న ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌కు సంబంధించిన విషయంలో ఈ కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఆర్‌ఐ బాలకిషన్, జూనియర్ అసిస్టెంట్ మహేందర్‌లు మూడు రోజుల్లో వివరణ రిపోర్టులు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో తహసీల్దార్ సోమవారం ధ్రువీకరించారు. అలాగే తప్పుడు ధ్రువపత్రాలతో తప్పుదోవ పట్టించిన వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

సొంత భవనం నిర్మించండి

ఎస్సీ, ఎస్టీ చైర్మన్ వెంకటయ్య

దుబ్బాకరూరల్: మండల పరిధి హబ్సిపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, గురుకుల విద్యాలయాల కార్యదర్శి సైదులును కోరారు. 3వ తేదీన 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన 'అద్దె భవనంలో గురుకులం' అనే కథనానికి వెంకటయ్య స్పందించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో వారిని కలిసి మాట్లాడారు. ప్రస్తుతం స్పోర్ట్స్ స్టేడియంలోని అద్దె భవనంలో గురుకులం కొనసాగుతుందని వారికి వివరించారు. అయితే స్టేడియాన్ని బీసీ సంక్షేమశాఖకు కేటాయిస్తే భవన నిర్మాణం చేపడతామని వారు హామీ ఇచ్చినట్టు వెంకటయ్య తెలిపారు. బీటీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.



బీసీ సంక్షేమశాఖ కార్యదర్శితో మాట్లాడుతున్న వెంకటయ్య

ఇసుక అక్రమ రవాణాపై కొరడా



ముత్తన్నపేట శివారులోని ఓ పొలంలో కూలీలతో కలిసి నాట్లు వేస్తున్న ఎస్‌ఐ సౌజన్య, కానిస్టేబుల్స్

కఠిన చర్యలు తప్పవు: ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరుతో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సౌజన్య హెచ్చరించారు. మండలంలోని తోటపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు పరిసరాల్లో సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి పర్యటించారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్‌చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం అందజేస్తున్న ఇసుక అనుమతి పత్రాలతో కొంతమంది వ్యాపారం చేస్తున్నారన్నారు. అలా జరగకుండా ఉండాలంటే లబ్ధిదారులు ఇసుకతోపాటు టోకెన్‌లు రిటన్ తీసుకోవాలని చెప్పారు. అలాగే ధ్రువపత్రాలున్న ట్రాక్టర్‌లలో మాత్రమే ఇసుక రవాణా చేయాలని సూచించారు.

చైన్‌స్నాచింగ్‌పై అవగాహన

బెజ్జంకి, మండలంలోని ముత్తన్నపేట శివారులో వరినాట్లు వేస్తున్న మహిళలకు ఎస్‌ఐ సౌజన్య చైన్ స్నాచింగ్‌పై అవగాహన కల్పించారు. వారితో కలిసి వరినాట్లు వేశారు. కూలీల స్థితిగతులను తెలుసుకున్నారు. బంగారు ఆభరణాలను ధరించి పనులకు వెళ్లవద్దని సూచించారు. పనుల ధ్యాసలో ఆదమరిచి ఉండటాన్ని దుండగులు అవకాశంగా తీసుకుని చోరీలకు పాల్పడతారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్రమశిక్షణ చాలా ముఖ్యం

ఏసీపీ సదానందం



మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

హుస్నాబాద్: పోలీస్‌శాఖలో యూనిఫాం వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమ శిక్షణ చాలా ముఖ్యమని ఏసీపీ సదానందం అన్నారు. డివిజన్ పరిధిలో నూతనంగా నియామకమై విధుల్లో కొనసాగుతున్న కానిస్టేబుళ్ళకు సోమవారం ఏసీపీ కార్యాలయంలో ఇంట్రాక్టివ్ సెషన్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వాహణలో కానీ, వ్యక్తిగతంగా కానీ సమస్యలు తన దృష్టికి తేవాలన్నారు. యూనిఫాంలో ఉన్నవారిని పది మంది గమనిస్తూ ఉంటారని, అది తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చెప్పారు. అందరు సమానమేనని, క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించే వారిని గుర్తించి రివార్డులు, అవార్డులు అందజేస్తామని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణ కూడా చాలా అవసరమని సూచించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై గట్టి నిఘా పెట్టాలని ఏసీపీ ఆదేశించారు.

రుణాలను వినియోగించుకుంటే ఆర్థికవృద్ధి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): సహకార బ్యాంకులు అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ దుకాణ సముదాయాన్ని మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా రైతులు దృష్టి సారించాలన్నారు. మండల పరిధిలోని రైతులకు ఎరువుల కొరత రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి, బాలాగౌడ్, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధించగలం

– హెచ్‌ఎం కోట ప్రభు



భావనను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చిన్ననాటి నుంచి విద్యలో రాణిస్తేనే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోట ప్రభు అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని సలేంద్రి భావనను సోమవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సుజాత, శ్రీనివాసగౌడ్, పద్మావతి, శ్రీలత, కృష్ణవేణి, అరుణాబాయి, సరస్వతి, మల్లయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడొద్దు

సిద్దిపేటఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు గొడవలకు దిగకుండా కలిసి మెలిసి ఉండాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ప్రజలకు సూచించారు. అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించి ప్రజలకు పలుఅంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణ, సీసీ కెమెరాలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, ఆ బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందని చెప్పారు. మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో 2025–2026 విద్యాసంవత్సరానికి గాను పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లలో అడ్మిషన్ల గడువును 31 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి(80084 03635)ని సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో పాముల కలకలం

- భయం మధ్య విద్యార్థులు, సిబ్బంది
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం ఉదయపూర్ ప్రాథమిక పాఠశాలలో తరచూ పాములు కలకలం సృష్టిస్తున్నాయి. పాముల బెడదతో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు వంట గదిని శుభ్రం చేస్తుండగా సోమవారం పాము రావడంతో భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సహాయంతో దాన్ని చంపేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, పక్కనే పొలాలు ఉండటం వల్ల నేరుగా విషసర్పాలు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చాలా చోటు చేసుకున్నాయి. పాముల బెడద ఉండటం వల్ల తమ పిల్లలకు రక్షణ లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వేడుకుంటున్నారు. తరుచూ వంట గదిలోకి పాములు రావడంతో బిక్కుబిక్కుమంటూ వంట చేస్తున్నామని వంట చేసే కార్మికులు వాపోతున్నారు.

ఇళ్లు మంజూరైనా.. పట్టాలు ఇవ్వరా?

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

చేర్యాల(సిద్దిపేట): తమకు ఇళ్లు మంజూరయ్యాయని, పట్టాలు ఇస్తామని చెప్పిన అధికారులు ఇవ్వడంలేదని పలువురు లబ్ధిదారులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్, ఎంపీ చేతుల మీదుగా జరిగిన పట్టాల పంపిణీ సందర్భంగా పట్టాలు రాని వారికి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పట్టాలు ఇస్తామని గ్రామాల కార్యదర్శులు చెప్పారన్నారు. కార్యదర్శులు చెప్పిన ప్రకారం కార్యాలయానికి వచ్చిన తమకు పట్టాల పంపిణీ చేయలేదని, అనివార్య కారణాలచేత నిలిపి వేశామని చెబుతున్నారని వాపోయారు. తమకు ఇళ్లు మంజూరైనా పట్టాలు ఆపడం సరికాదని, వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ చాంబర్, కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ మహబూబ్‌అలీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు. ఆందోళనకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తం



విద్యార్థులతో ఎస్‌ఐ కీర్తిరాజు

దుబ్బాకరూరల్: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కీర్తి రాజు పిలుపునిచ్చారు. మండలంలోని గంభీర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 29 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.57,500 జరిమానా విధించారు.

◆ ధర్మపరిరక్షణలో భాగస్వాములుకండి

గజ్వేల్‌రూరల్: హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ పిలుపునిచ్చారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని కేసరి హనుమాన్ దేవాలయంలో సోమవారం నిర్వహించిన గురు పూజోత్సవంలో ఆయన మాట్లాడారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, ఆలయ నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, పిచ్చయ్య, శ్రీనివాస్, జయసింహ, రమేశ్ పాల్గొన్నారు.

◆ సీపీఐ జిల్లా మహాసభ రేపు

సిద్దిపేటఅర్బన్: హుస్నాబాద్‌లో బుధవారం నిర్వహించనున్న సీపీఐ జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. సిద్దిపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభల సందర్భంగా హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి కేజేఆర్ గార్డెన్ వరకు ప్రదర్శన ర్యాలీ ఉంటుందని తెలిపారు. నాయకులు సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి, కలవేణి శంకర్ హాజరవుతారని చెప్పారు.

◆ రుణాలు అందించాలి: డీబీఎఫ్ నేత

గజ్వేల్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు గాను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ముందస్తుగా డబ్బులు చెల్లించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొందరు తమ ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేకపోతున్నారని, వారికి మహిళా సంఘాల ద్వారా రుణాన్ని అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు.

◆ రైతుల నడ్డి విరుస్తున్నారు ..

సిద్దిపేటజోన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నడ్డి విరుస్తున్నాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ సుందర్, మోహిజ్‌లతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు యూరియా ధరలను పెంచి రైతులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. అలాగే కల్లపల్లి పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతలు ప్రారంభించి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీహరి, రమేశ్ లింగం, ఎల్లయ్య, బాబు, సతీశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ అసమర్థత వల్లే కష్టాలు

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే వ్యవసాయరంగం సంక్షోభం దిశగా పయనిస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. గజ్వేల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో రైతులు సాగు..సాగక ఆందోళనలో ఉన్నారని వాపోయారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లను నింపి నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, శివకుమార్, ఉమర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

◆ ఫంక్షన్ హాల్ నిర్మాణం పరిశీలన

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో రూ.కోటి నిధులతో చేపట్టిన ఫంక్షన్ హాల్ నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు కుమ్మరి కనకయ్య, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్ కోరారు. ఫంక్షన్ హాల్‌ను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పేదలకు అందుబాటులో కల్యాణ మండపం ఉండాలన్న ఉద్దేశ్యంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఐలయ్య, బాలకృష్ణ, ఇస్మాయిల్, బషీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయం అభివృద్ధి కృషిచేద్దాం

దుబ్బాక: పట్టణంలోని పోచమ్మ ఆలయ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అన్ని కుల సంఘాల నాయకులు ముందుకొచ్చారు. పట్టణంలో దాతల నుంచి సోమవారం విరాళాలు సేకరించారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పురోహితులు వేలేటి జయరామశర్మ, పలు కులసంఘాల పెద్దలు పాల్గొన్నారు.